

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
ఆదివారం 22 సెప్టెంబరు 2024
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 27.0 కనిష్ఠం : 23.0





తెలంగాణ సురవరం



సురవరం ప్రతాపరెడ్డి

తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరుకు కేబినెట్ అంగీకారంపై హర్షం

- తెలంగాణ చరిత్ర, సాహిత్య, రాజకీయాల్లో ఆయనది ప్రత్యేక స్థానం
- 1952లో వనపర్తి నియోజకవర్గం నుంచి మొదటి ఎమ్మెల్యేగా ఎన్నిక
- తెలుగు భాష కోసం విశేష కృషి.. గోలకొండ కవుల పేరిట సంకలనం
- గోల్కొండ, ప్రజావాణి పత్రికల స్థాపన.. నిజాంకు వ్యతిరేక పోరాటం


సంపాదకుడిగా.. పరిశోధకుడిగా.. పండితుడిగా.. రచయితగా.. ప్రేరకుడిగా.. క్రియాశీల ఉద్యమ కారుడిగా.. రాజకీయ నాయకుడిగా పని చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. తెలుగు భాష కోసం విశేషంగా కృషి చేసిన ఆయన పేరును తెలుగు యూనివర్సిటీకి పెట్టాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. తెలంగాణలో కవులే లేరనే ముడుంబ వెంకట రాఘవాచార్యులు అన్న మాటలను సవాలుగా తీసుకుని 354 మంది తెలంగాణ కవుల శ్లోకాలను, పద్యాలను సేకరించి.. గోల్కొండ కవుల సంచికను వెలువరించిన ఘనత ఆయనది.. ఉమ్మడి పాలమూరులోని జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలపాడుకు చెందిన ఆయన పేరు తెలుగు వర్సిటీకి పెట్టడం జిల్లాకు గర్వకారణమని అంటున్నారు ప్రజా ప్రతినిధులు, పండితులు, కవులు, రచయితలు.

- మహబూబ్‌నగర్
(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు యూనివర్సిటీకి పెట్టాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా తెలుగు బాష ఉన్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటున్నారు. సురవరం ఏబీఎం మిషనరీ పాఠశాలలో ప్రాథమిక విద్యను, హైదరాబాద్ నిజాం కాలేజీలో ఇంటర్, మద్రాస్ ప్రెసిడెన్సీలో బీఏ, బీఎల్ చదివారు. ఆయన పేరును సార్థకం చేసేలా తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడంపై ఉమ్మడి జిల్లాకు చెందిన రాజకీయ నాయకులు, కవులు, రచయితలు, కళాకారులు, కుటుంబ సభ్యులు, భాషా పండితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో తెలుగు భాషను మాతృ భాషగా, రాజ్య బాషగా మార్చడంలో ఆయన సేవలు మరువలేనివని కొనియాడుతున్నారు. గత ప్రభుత్వాల హయాం నుంచి సురవరం ప్రతాపరెడ్డిని పలు సందర్భాల్లో గుర్తు చేసుకుంటున్నారు. ట్యాంక్‌బండ్, మహబూబ్‌నగర్, వనపర్తి, స్వగ్రామం ఇటిక్యాలపాడులో తన విగ్రహాలు ఏర్పాటు చేసి ఏటా వర్ధంతి, జయంతులకు స్మరించుకుంటున్నారు.

సాంస్కృతిక చరిత్రలో ఆయన ఒక అధ్యాయం


తెలంగాణ స్థానిక చరిత్ర, ఇక్కడి సాహిత్యం, ప్రజల కడగండ్లను కళ్లకు కట్టినట్లు తెలియజేయాలని తపన ఉన్న సురవరం.. ఆ దిశగా అనేక సేవలు అందించారు. తెలంగాణలో కవులు లేరనే నిందా వ్యాఖ్యలను సవాలుగా తీసుకుని ఏకంగా 354 మంది తెలంగాణ కవుల పద్యాలు, శ్లోకాలు, రచనలను గోల్కొండ కవుల సంచిక పేరుతో వెలువరించారు. అందులో పాలమూరు జిల్లాకు చెందిన 87 మంది కవుల వివరాలు కూడా ఉన్నాయి. ఇప్పటికీ ఇది ఒక ప్రామాణిక గ్రంథంగా ఉంది. 1926లో తెలుగు బాషా వికాసానికి దోహదపడే విధంగా గోల్కొండ పత్రికను స్థాపించి.. సంపాదకులుగా వ్యవహరించారు. నిజాం కాలంలో రాజ్య భాష, పాలన, వ్యవహార భాషగా ఉర్దూ ఉండగా.. తెలుగులో రెండు వార పత్రికలు మాత్రమే ఉండేవి. ఆ తర్వాత సురవరం భారతీ సాహిత్య, ప్రజావాణి పత్రికలను కూడా స్థాపించి నడిపారు. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, పార్సీ, ఆంగ్ల భాషల్లో నిష్ణాతులుగా ఉన్న ఆయన నైజాం నిరంకుశ పాలనలో తెలుగు వారి అణిచివేతను వ్యతిరేకించారు. ప్రజలను చైతన్యం చేసేందుకు తెలుగు భాష, సంస్కృత వికాసానికి ఎనలేని సేవలు అందించారు. తెలంగాణ గ్రంథాలయ ఉద్యమంలోనూ ఆయన పాత్ర చాలా కీలకం. 1942లో ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు ఆయన అధ్యక్షత వహించారు. 1944లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్‌కు కూడా అధ్యక్షులుగా పని చేశారు. రెడ్డి హాస్టల్ కార్యదర్శిగా ఉన్నప్పుడు వేయి గ్రంథాలు ఉన్న లైబ్రరీని 11 వేల గ్రంథాలకు పెంచి.. విద్యార్థుల బాషాభివృద్ధికి కృషి చేశారు. అలాగే 1930లో మెదక్ జిల్లా జోగిపేటలో జరిగిన మొట్టమొదటి ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహించి, ఆంధ్ర మహాసభ కార్యకలాపాలన్నీ తెలుగులోనే జరగాలని తీర్మానం చేయించారు. ఇందుర్తి ప్రభాకర్ రావు, ఎల్లూరి శివారెడ్డి, ముద్దసాని రామిరెడ్డి వంటి వారు ఆయన జీవితం, రచనలపై సమగ్ర పరిశీలన చేస్తూ గ్రంథాలు కూడా రాశారు.



స్వగ్రామం ఇటిక్యాలపాడులో సురవరం ప్రతాపరెడ్డి విగ్రహం

వనపర్తి మొదటి శాసన సభ్యులు

సురవరం ప్రతాపరెడ్డి.. హైదరాబాద్ రాష్ట్రానికి జరిగిన మొదటి ఎన్నికల్లో వనపర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేశారు. సమీప ప్రత్యర్థి అయిన న్యాయవాది వి.రామచంద్రారెడ్డిపై విజయం సాధించారు. ఆయనకు మొదటి నుంచి రాజకీయాలు అంటే ఆసక్తి లేకపోయినా.. కాంగ్రెస్ పార్టీ, సన్నిహితుల ఒత్తిడితో పోటీ చేసి గెలుపొందారు. అప్పుడు జిల్లా వ్యక్తి అయిన బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ఉన్నారు. రాజకీయాలనే చీకటి బజారులో తాను, తనవంటి వారు పనికిరారు అని పేర్కొని.. ఆ తర్వాత రాజకీయాలకు దూరమయ్యారు. ఆయన రాసిన వాటిలో ఆంధ్రుల సాంఘిక చరిత్రకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. తెలంగాణలో కవులు లేరని చెప్పిన ఆంధ్ర పండిత విమర్శకుల నుంచి ప్రశంసలు పొందారు. గోల్కొండ కవుల సంచిక, ఆంధ్రుల సాంఘిక చరిత్ర, హైందవ ధర్మవీరులు, హిందువుల పండుగలు, రామాయణ కాలం నాటి విశేషాలతో గ్రంథాలు రచించారు. భక్త తుకారాం, ఉచ్ఛల విషాదం అనే నాటకాలు కూడా రాశారు.



గర్వించదగిన పరిణామం

తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడం చాలా సంతోషంగా ఉంది. అందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు. తెలంగాణలో కవులు లేరని అవహేళన చేసిన వారి సవాల్‌ను స్వీకరించి.. గోల్కొండ కవుల సంచిక తీసుకువచ్చిన ఘనత సురవరం ప్రతాప్‌రెడ్డిది. గత ప్రభుత్వాలు కూడా వారి పేరును ప్రతీ సందర్భంలో గుర్తు చేసుకున్నాయి. పాలమూరు యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టాలని గతంలో నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

- సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి



సమున్నత గౌరవం

తెలుగు భాష కోసం, తెలంగాణ ఆత్మగౌరవం కోసం పనిచేసిన మహనీయుడు సురవరం ప్రతాపరెడ్డి. వనపర్తి తొలి శాసన సభ్యులుగా పనిచేసిన ఆయన చరిత్రలో నిలిచిపోయారు. ఈ రోజు తెలంగాణ కవులు ప్రామాణిక గ్రంథంగా గోల్కొండ కవుల సంకలనం తీసుకుంటున్నారంటే ఆ రోజు ఆయన తెలంగాణకు చెందిన కవులను ఏ స్థాయిలో నిలబెట్టారో అర్థం చేసుకోవచ్చు. తెలుగు వర్సిటీకి ఆయన పేరు పెట్టినందుకు సీఎం రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

- తూడి మేఘారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే

ఆయన చరిత్ర ఈ తరానికి తెలియాలి



తెలంగాణ, తెలుగు భాషకు ఆత్మగౌరవ ప్రతీక సురవరం ప్రతాపరెడ్డి. ఆయన చేసిన సేవలు, ఆయన చరిత్ర ఈ తరానికి తెలియాలి. అందుకే గత ప్రభుత్వంలో నేను స్వయంగా ఆయన చేసిన సేవలపై సంకలనాలు ముద్రించి అందరికీ తెలియజేసే ప్రయత్నం చేసిందుకు గర్వపడుతున్నా. వనపర్తి తొలి శాసన సభ్యుడిగా ఆయన విగ్రహం పెట్టించాను. అప్పట్లోనే తెలుగు వర్సిటీకి ఆయన పేరు పెట్టాలని 126వ జయంత్రి సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలియజేశాను. తర్వాత ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారిపోవడం జరిగింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామం.

- సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి

తెలుగు భాషకు సమున్నత సేవలు



తెలంగాణ ప్రాంతంలో తెలుగు భాషకు సమున్నతమైన సేవలు అందించన వ్యక్తి సురవరం ప్రతాపరెడ్డి. ఒకనాడు తెలుగు మాట్లాడటానికి ఇబ్బంది పడినటువంటి పరిస్థితుల్లో.. గోల్కొండ పత్రిక ద్వారా తెలుగు భాషా సేవకు పాటుపడిన భాషాభిమాని ఆయన. నూరు సంవత్సరాల కిందటే తెలంగాణ ఆత్మగౌరవం సురవరం. సంస్థాన పాలకుల సహచర్యంతో తెలుగు బాషా సేవ సాహిత్య సృజనకు తనవంతు కృషి చేశారు.

- బైరోజు చంద్రశేఖర్, స్కూల్ అసిస్టెంట్, తెలుగు

మాతృభాష మీద మమకారం పెంచిన వ్యక్తి



మాతృ బాష తెలుగు మీద మమకారం పెంచిన వ్యక్తి సురవరం ప్రతాపరెడ్డి. తెలుగు బాష ప్రజల భాషగా తీర్చిదిద్దేందుకు సార్వసత్త పరిషత్ ద్వారా ప్రాథమిక పాఠశాలల కొనసాగించారు. విద్యార్థులకు తెలుగుపై పట్టును పెంచేందుకు గ్రంథాలను సమకూర్చారు. గోల్కొండ, ప్రజావాణి పత్రికలను నిర్వహించి తెలంగాణ ప్రజలకు మాతృభాష మీద మమకారాన్ని పెంచిన మహానుభావుడు.

- బలరాం, కవి, రచయిత, వనపర్తి

సాహితీ లోకానికి ఆయన సేవలు అనన్యం



సురవరం ప్రతాపరెడ్డి పాలమూరు వాసి కావడం అందరికీ గర్వకారణం. తెలంగాణ ఆత్మగౌరవం, తెలుగు భాష ఖ్యాతిని పెంచిన ఘనత ఆయనది. ధిక్కార స్వరాన్ని కలం ద్వారా వినిపించారయాన. గోల్కొండ, ప్రజావాణి పత్రికల ద్వారా భాషోద్యమాలు నడిపారు. ఆయన స్ఫూర్తితోనే సాహితీ కళా వేదికను ప్రారంభించాం. ఆయన స్ఫూర్తితోనే మేము కూడా అందరూ పుస్తకాలు చదవడం కోసం వివిధరకాల పుస్తకాలను సేకరిస్తున్నాం.

- పలుస శంకర్‌గౌడ్, సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు, వనపర్తి

బిల్లులు చెల్లించాలని పాడి రైతుల వినతి



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాడి రైతులు

కల్వకుర్తి, సెప్టెంబరు 21 : పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాడి రైతులు శనివారం రోడెక్కారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రం వద్ద ప్రధాన రహదారిపై పాడి రైతులు రాస్తారోకో చేపట్టారు. అనంతరం మేనేజర్ యాకన్నకు వినతిపత్రం అందజేశారు. పాలబిల్లులు పెండింగ్‌లో ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాల్‌రాజు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఖాజాపాషా, మల్లేష్, మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేష్, శ్రీనివాస్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

బాలుడి కిడ్నాప్

వనపర్తి క్రైం, సెప్టెంబరు 21 : వనపర్తి బస్టాండ్‌లో ఎనిమిది నెలల బాలుడి కిడ్నాప్ కలకలం సృష్టించింది. వనపర్తి జిల్లా ఏదుల గ్రామానికి చెందిన స్వప్న అనే ఓ మహిళ తన ఎనిమిది నెలల బాలుడిని తీసుకొని చికిత్స నిమిత్తం శనివారం ఉదయం 10 గంటలకు వనపర్తి బస్టాండ్‌కు వచ్చింది. బస్టాండ్‌లో దిగగానే ఆమె పక్కనే ఉన్న ఓ యువతికి తన కుమారుడిని అప్పగించి వాష్‌రూంకు వెళ్లింది. వెంటనే వచ్చి చూసేసరికి బాలుడు, ఆ యువతి కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది. ఈ విషయాన్ని తన తమ్ముడు మధుకు ఫోన్ ద్వారా తెలియజేసింది. వెంటనే మధు వనపర్తిలో ఉన్న తన స్నేహితులకు సమాచారం ఇచ్చి అందరూ కలిసి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రామరాజు, జయన్న లు అప్రమత్తమై బస్టాండ్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించడంతో బాలుడిని ఎత్తుకున్న యువతి హైదరాబాద్ బస్సు ఎక్కి వెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులు డిపో మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లగా బస్సు నెంబర్ ఆధారంగా బస్సులో ఉన్న డ్రైవర్, కండక్టర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పడంతో బస్సులో బాలుడిని ఎత్తుకున్న యువతి ఉన్నదని గుర్తించారు. వారు అప్రమత్తమై ఆ బస్సును పోలీసుల సూచన మేరకు షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. వనపర్తి పోలీసులు కిడ్నాప్‌కు గురైన బాలుడితో పాటు నిందితురాలిని వనపర్తి స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీసులు అదుపులోకి తీసుకొని ఆ యువతిని విచారించగా పొంతనలేని సమాధానాలు చెబుతుండటంతో ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో కొన్ని రోజుల నుంచి ఆ యువతి మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేశామని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామరాజు తెలిపారు. కిడ్నాప్ ఘటనను మూడు గంటల్లోనే పోలీసులు ఛేదించి వారి తల్లిదండ్రులకు అప్పగించడంతో బాలుడి కుటుంబ సభ్యులు భావోద్వేగంతో కన్నీరు మున్నీరయ్యారు. ఎస్‌ఐలతో పాటు సిబ్బందిని ఏఎస్పీ, డీఎస్పీ, సీఐ అభినందించారు.

రైతుల కోసం..

ట్రాక్టర్ స్టీరింగ్ పట్టిన ఎమ్మెల్యే

- కేఎల్ఐ కాల్వ మరమ్మతు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్, సెప్టెంబరు 21: రైతుల కోసం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ట్రాక్టర్ స్టీరింగ్ పట్టాడు. మిడ్జిల్ మండలం వాడియాల గ్రామ శివారులో మరమ్మతులు చేస్తున్న కేఎల్ఐ ప్రధాన కాల్వ వద్దకు ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్లి పరిశీలించారు. కూలిపడిన కాంక్రీట్ పనిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను పటిష్ఠంగా చేసి, రైతులకు ఇబ్బందులు లేకుండా కేఎల్ఐ నీటిని అందించాలన్నారు. అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ్ రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు ఉన్నారు.



ట్రాక్టర్ నడుపుకుంటూ కేఎల్ఐ కాల్వ వద్దకు వెళ్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

క్యాన్సర్ బాధితులకు ప్రత్యేక చికిత్స

- గద్వాల జిల్లాలో 111 మంది బాధితులు
- వారికోసం ప్రభుత్వ ఆస్పత్రిలో పాలియేటివ్ కేర్ సెంటర్ ఏర్పాటు
- నేడు ప్రపంచ క్యాన్సర్ బాధితుల సాంత్వన దినం

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 21: జోగుళాంబ గద్వాల జిల్లాలో క్యాన్సర్ రోగులకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన పాలియేటివ్ కేర్ ఆస్పత్రిలో వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. నేడు ప్రపంచ క్యాన్సర్ బాధితుల సాంత్వన దినం సందర్భంగా కథనం..

39 మంది బ్రెస్ట్ క్యాన్సర్ బాధితులు

జిల్లాలో 111 మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. వారిలో సర్వేకల్ క్యాన్సర్ బాధితులు 59 మంది ఉండగా, బ్రెస్ట్ క్యాన్సర్ బాధితులు 39 మంది, ఓరల్ క్యాన్సర్ బాధితులు 13 మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తోంది. జిల్లా ఆస్పత్రిలోని పాలియేటివ్ కేర్‌లో ప్రత్యేక చికిత్స అందిస్తోంది.

ప్రత్యేకంగా హోం కేర్ వాహనం

గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో క్యాన్సర్ రోగుల సౌకర్యార్థం ఏడాదిన్నర క్రితం ప్రత్యేకంగా పాలియేటివ్ కేర్‌ను ఏర్పాటు చేశారు. రోగులను ఇక్కడికి తరలించడానికి హోం కేర్ వాహనాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు ఇక్కడ చికిత్స చేయించుకొని, ఆదే వాహనంలో వారి ఇంటికి చేరుకోవచ్చు. వీరికి ఉచితంగా భోజనంతో పాటు మందులను కూడా పంపిణీ చేస్తారు.

సమతుల ఆహారం తీసుకోవాలి

క్యాన్సర్ బారిన పడిన వారు తగినంత వ్యాయామం చేయడంతో పాటు సమతుల పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలి. ఇలాంటి ఇబ్బందులు ఉంటే వైద్యులకు సమాచారం ఇవ్వాలి. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మందులను పంపిణీ చేసేందుకు ఎన్సీడీ జిల్లా కో-ఆర్డినేటర్ శ్యాంసుందర్ అందుబాటులో ఉంటారు.

- డాక్టర్ సంధ్యా కిరణ్మయి, జిల్లా ప్రోగ్రాం అధికారి



క్యాన్సర్ రోగిని పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంధ్యాకిరణ్మయి(ఫైల్)

PRAGATHI COLLEGE OF EDUCATION (B.Ed)
Approved by NCTE & Affiliated to Palamuru University
ACHAMPET, Nagarkurnool (Dist) 509 375
B.Ed. ADMISSION NOTIFICATION
'B' Category seats (Management Quata 25%) 2024-2025
Application are invited from Qualified and eligible Candidates for 25% seats in 'B'Category for Admission in top B.Ed course (2 years) for the academic year 2024-2025
SEATS AVAILABLE 1. Mathematics, 2. Physical Sciences, 3. Biological Sciences, 4. Social Sciences, 5. English, 6. Oriental Language
For further the details : Principal & Correspondent
CONTACT : 9440915873, 9490143075



ఓల్వో బస్సు బోల్తా ఒకరి మృతి

- నలుగురికి గాయాలు
- మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల వద్ద ఘటన

ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులు



కృష్ణయ్య (ఫైల్)



ప్రమాద స్థలం


అడ్డాకుల, సెప్టెంబరు 21 : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండల కేంద్రం వద్ద గల 44వ నెంబర్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఓల్వో బస్సు బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పాండిచ్చేరి నుంచి శుక్రవారం సాయంత్రం 27 మంది ప్రయాణికులతో బీఎంసీసీ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన ఓల్వో బస్సు హైదరాబాద్‌కు బయలు దేరింది. శనివారం ఉదయం స్నేహ చికెన్ ఫాంకు చెందిన కోళ్ల డీసీఎం వాహనం కొత్తకోట వైపు నుంచి అడ్డాకుల దగ్గర యూటర్న్ తీసుకుంటుండగా గమనించని ఓల్వో బస్సు డ్రైవర్ అదుపు తప్పి వెనుకవైపు నుంచి బలంగా ఢీకొట్టాడు. బస్సు పల్టీలు కొట్టి కింద పడిపోయింది. అదే సమయంలో కృష్ణయ్య (52), అంజనేయులు అనే ఇద్దరు గ్రామస్థులు బహిర్భూమికి వెళ్లి రోడ్డు పక్కన ఉండగా బస్సు నేరుగా కృష్ణయ్యపై పడింది. రోడ్డు రాపిడికి కృష్ణయ్య శరీరం మాంసపు ముద్దగా మారింది. బస్సులోని ప్రయాణికులు కుమార్, శ్యామ్‌కుమార్, కిరణ్, బస్సు డ్రైవర్ వెంకటేశ్‌లకు స్వల్ప గాయాలు కాగా ఎల్అండ్‌టీ, 108 అంబులెన్స్, పోలీస్ సిబ్బంది క్షతగాత్రులను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు క్రేన్ సహాయంతో బోల్తాపడిన బస్సును పక్కకుతీసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో పడి బాలుడు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 21: చెరువులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లికొండ గ్రామానికి చెందిన ఇమ్మడి కుర్మయ్య కొంతకాలంగా నాగర్‌కర్నూల్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసం ఉంటున్నాడు. మతిస్థిమితం లేని అతని కుమారుడు మహేష్(13) శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. కానీ ఆచూకీ లభించలేదు.

శనివారం నాగనూల్ చెరువులో శవమై కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమాదేవి తెలిపారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365



పేకాట స్థావరంపై దాడి


నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 21 : జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కాలనీలో పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ రమాదేవి శనివారం తెలియజేశారు. పేకాట ఆడినా.. ప్రోత్సహించినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి రూ.6వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.













ఫర్నీచర్ ధ్వంసం చేసిన భర్తపై కేసు నమోదు

వెల్దండ, సెప్టెంబరు 21 : మండల పరిధిలోని కొట్రలో ఇంట్లోని ఫర్నీచర్ ధ్వంసం చేసిన భర్తపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కొట్రకి చెందిన లక్ష్మికి రంగారెడ్డి జిల్లా, మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లికి చెందిన హరిప్రసాద్‌తో 14 ఏళ్ల కిందట వివాహమైంది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో లక్ష్మి రెండు నెలల కిందట తల్లిగారి ఇళ్లయిన కొట్రకు వచ్చింది. ఈ క్రమంలో ఈనెల 17న హరిప్రసాద్ భార్యపై అనుమానంతో కొట్రకు వచ్చి ఇంట్లోని ఫర్నీచర్, రేకులను ధ్వంసం చేశాడు. ఈ మేరకు లక్ష్మి ఫిర్యాదుతో భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలియజేశారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ


పాఠశాలలోని సైన్స్ ల్యాబ్

ఆత్మకూరు, సెప్టెంబరు 21: వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని జడ్పీహెచ్ పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రికి చోరీకి పాల్పడినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎప్పటిలాగే శుక్రవారం సాయంత్రం పాఠశాలలకు తాళం వేసి వెళ్లగా, రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సైన్స్ ల్యాబ్‌లోకి చొరబడి సీపీయూ, విద్యుత్ మోటార్ కనెక్షన్ ఉన్న వైర్‌తో పాటు మరికొన్ని సైన్స్ పరికరాలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. శనివారం ఉదయం పాఠశాల స్వీపర్ బాలరాజు వెళ్లి చూడడంతో అప్పటికే తాళాలు పగలగొట్టి ఉన్న సంగతి గమనించి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు రూ.30వేలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని హెచ్‌ఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ముగిసిన పీజీ పరీక్షలు

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 21 : పాలమూరు యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న పీజీ సెంటర్లలో నిర్వహించిన పీజీ, ఎంబీఏ, ఎంసీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈ పరీక్షలకు మొత్తం 1,873 మంది విద్యార్థులకు గాను 1769 మంది విద్యార్థులు హాజరయ్యారు. పీజీలో 1,423 మంది, ఎంసీఏ 50 మంది, ఎంబీఏ 293 మంది, విద్యార్థులు హాజరయ్యారు. అందులో 101 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే ముగ్గురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడ్డారు. ఈ పరీక్షలను పీయూ పరీక్షల నియంత్రణ అధికారి రాజ్‌కుమార్, పీజీ ప్రిన్సిపాల్ డా.చంద్రకిరణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

డిగ్రీ ఫెయిల్ అయిన విద్యార్థులకు మరో అవకాశం

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 21 : పాలమూరు యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాల 2021-22 సంవత్సరంలో అడ్మిషన్ పొందిన డిగ్రీ ఆరో సెమిస్టర్ విద్యార్థులకు మరోసారి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు పీయూ పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పరీక్షలకు సంబంధించిన ఫీజులను ఈ నెల 26వరకు చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలను వచ్చేనెల 3న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు పాలమూరు యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

హన్వాడ, సెప్టెంబరు 21: మండలంలోని నాయినోనిపల్లిలో శనివారం విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన కటికె రత్నోజీ ఇంట్లో ఫ్రిడ్జ్ వైర్ కాలి ఫ్రిడ్జ్ పేలింది. ఒక్కసారిగా మంటలు రావడంతో కట్టెల ఇల్లు కావడంతో మంటలు చెలరేగాయి. రూ.50 వేల నగదు, బియ్యం వంట సామగ్రి, భూమి పట్టా పాసుపుస్తకాలు ఇతర సామగ్రి కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే సామగ్రి పూర్తిగా కాలిపోయింది. ఇల్లు లేక రోడ్డున పడ్డానని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వాపోయాడు.

విద్యార్థులకు చాలీచాలని భోజనం

రేవల్లి, సెప్టెంబరు 21 : మండలం కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా బడి పిల్లలకు పెట్టే భోజనం సరిపోవటం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి వారు హాజరై ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు నాణ్యమైన చదువు, భోజనం అందించేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను, అధికారులను కోరారు. ఈవిషయంపై ప్రధానోపాధ్యాయురాలు మాధవి దేవిని వివరణ కోరగా ఒక్కో విద్యార్థికి వంద గ్రాముల బియ్యం, పది మందికి కిలో బియ్యం వండాలని, ప్రభుత్వం నిర్ణయించి దాని ప్రకారమే వంట చేస్తున్నామని వివరించారు.





బైక్‌ను ఢీకొన్న డీసీఎం : యువకుడి మృతి

పెబ్బేరు రూరల్, సెప్టెంబరు 21: వనపర్తి జిల్లా పెబ్బేరు జాతీయ రహదారిపై బైక్‌ను డీసీఎం ఢీకొట్టగా యువకుడు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు టమాట లోడుతో వెళ్తున్న డీసీఎం ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మానవపాడు మండలం బోరెల్లికి చెందిన రాకేష్ (26) అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో యువకుడు మధుకు స్వల్ప గాయాలయ్యాయి. డీసీఎం అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్, క్లీనర్ కు గాయాలు కావడంతో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాకేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.

బైక్‌పై నుంచి కిందపడి వ్యక్తి మృతి

కేటీదొడ్డి, సెప్టెంబరు 21: బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని ఇర్కిచేడు తండాలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇర్కిచేడుతండాకు చెందిన శంకర్‌నాయక్ (30) శుక్రవారం రాత్రి బైక్‌పై పాతపాలెం వెళ్లి పొలానికి పిచికారి చేసే మందులు తీసుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఇర్కిచేడు శివారులో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రగాయాలయాయి. గమనించిన స్థానికులు గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి సోదరుడు మున్నానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

ఊట్కూర్, సెప్టెంబరు 21 : ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పులిమామిడిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణంరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పులిమామిడికి చెందిన జయరాములు (35) శుక్రవారం సాయంత్రం గ్రామ సమీపంలోని చెరువు వద్ద కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. రాత్రి అయినా ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికినా కనిపించలేదు. దీంతో ఎక్కడికైన వెళ్లి ఉంటాడని వారు భావించారు. ఉదయం చెరువులో మృతదేహం తేలడంతో గ్రామస్తులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య



అఖిల (ఫైల్)

మిడ్జిల్, సెప్టెంబరు 21: ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దశరథం, భీమమ్మల కుమార్తె అఖిల (21) శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. చుట్టు పక్కల వారు గమనించి ఆమెను పరిశీలించగా అప్పటికే మృతి చెందింది. కాగా తండ్రి దశరథం రెండేళ్ల క్రితం మృతి చెందాడని, ఎప్పుడూ తండ్రిని తలుచుకుని అఖిల బాధపడేదని గ్రామస్థులు తెలిపారు. ఇదే విషయంపై ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బాలిక మృతిపై అనుమానాలు

- విచారణ చేపట్టిన పోలీసులు

కేటీదొడ్డి, సెప్టెంబరు 21 : జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని ఉమిత్యాలలో బాలిక మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 12వ తేదీన బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా గమనించిన కుటుంబ సభ్యులు గద్వాలలో, అక్కడి నుంచి కర్నూలులోని ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా శుక్రవారం మృతి చెందింది. పోలీసులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేశారు. శనివారం బాలిక అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న సీఐ నాగేశ్వర్‌రెడ్డి ఉమిత్యాల చేరుకొని బాలిక తల్లిదండ్రులను విచారించారు. ఎవరిపైనా అనుమానాలు ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు. కాగా బాలిక మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో ఓ వార్త వైరల్ అయ్యింది. ముగ్గురు యువకులు ఆమెను లైంగిక వేధింపులకు గురి చేయడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని ఉంది. ఈ విషయంపై పోలీసులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

బాలికతో అసభ్య ప్రవర్తన

హన్వాడ, సెప్టెంబరు 21: మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలానికి చెందిన బాలికతో ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించిన ఘటన మూడు రోజుల క్రితం చోటు చేసుకోగా శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలిక ఆడుకుంటూ ఉండగా, ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించగా చుట్టు పక్కల ఉన్నవారు మందలించినట్లు తెలిసింది. మద్యం మత్తులో అలాంటి పని చేసి ఉంటాడాని స్థానికులు తెలిపారు. అతనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

కేజీబీవీని పరిశీలించిన జీసీడీవో



మానవపాడు కేజీబీవీని పరిశీలిస్తున్న జీసీడీవో, ఎంపీడీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మానవపాడు, సెప్టెంబర్ 21 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు శుక్రవారం అస్వస్థతకు గురైన ఘటనపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు జీసీడీవో ఫర్హానబేగం, ఎంపీడీవో భాస్కర్ శనివారం పాఠశాలను పరిశీలించారు. చర్మ సమస్య ఉన్న విద్యార్థినులతో మాట్లాడారు. అదేవిధంగా పాఠశాల ఆవరణ పరిశీలించి తాగునీటి ట్యాంక్‌లను, మిషన్ భగీరథ నీరు సంపును చూశారు. మూడు రోజులుగా పలు కారణాలచే మిషన్ భగీరథ నీరు సరఫరా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అధికారుల దృష్టికి సిబ్బంది తెచ్చారు. సమస్య పరిష్కరించేందుకు పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటిని సరఫరా చేయించుకున్నామని, విద్యార్థులకు విష జ్వరాలు, చర్మ సమస్యలు వస్తే పాఠశాలలో ఎలాంటి మందులు లేవని ఎస్‌వో అనురాధ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పరిశీలనకు వచ్చిన అధికారుల మాత్రం క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యపై చర్చించకపోవడం, తూతూ మంత్రంగా బ్లీచింగ్ పౌడర్‌ను చల్లి, రేపు శుభ్రపరుస్తామని, తక్షణ స్పందన లేకపోవడంపై గమనార్హం. సమస్య బయటికి పొక్కడం, పాఠశాలలోకి విలేకరుల అనుమతించినందుకు పాఠశాల ఎస్‌వోపై అధికారులు మండిపడ్డారు.

సౌర వెలుగులకు సర్వే ప్రారంభం



కొండారెడ్డిపల్లిలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

వంగూరు, సెప్టెంబరు 21 : సౌర విద్యుత్ ఏర్పాటు చేసేందుకు పైలెట్ ప్రాజెక్టుగా సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లిలో ఎంపికైన విషయం విధితమే. ఈ మేరకు అధికారులు గ్రామంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై శనివారం సర్వే ప్రారంభించారు. జిల్లా పశువైద్య శాఖ అధికారి రమేష్, ట్రాన్స్‌కో ఎస్ఈ వెంటేశ్వర్లు, రెడ్‌కో డీఎం మనోహర్ ఆధ్వర్యంలో 65 మంది సిబ్బంది, 25 బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహించారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుబుక్, విద్యుత్ కనెక్షన్ నెంబర్, బోరు మోటార్ ఫొటోలతో దరఖాస్తులు పూర్తి చేశారు. వివరాలను స్థానిక ఎంచాయతీ కార్యాలయంలో కంప్యూటర్లలో పొందుపరిచారు. గ్రామంలో 967 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, వాటిపై మూడు రోజుల్లో సర్వే పూర్తి చేస్తామని సర్వే పర్యవేక్షణ అధికారి రమేష్ తెలిపారు. డీఈ శ్రీధర్‌రెడ్డి, ఏఈ మేఘనాథ్ తదితరులు ఉన్నారు.

రోగులకు అందని భోజనం

- ప్రభుత్వ ఆసుపత్రిలో భోజన పథకం ఉన్న విషయం ఎరుగని రోగులు

- భోజనం పంపిణీ చేయకుండానే కాంట్రాక్టర్‌కు బిల్లులు

- ఉప్పునుంతల ప్రభుత్వ ఆస్పత్రిపై కొరవడిన పర్యవేక్షణ



ఉప్పునుంతల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

ఉప్పునుంతల, సెప్టెంబరు 21 : పేదలకు వైద్యం అందించడంతో పాటు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు మూడు పూజల భోజనం అందించేందుకు ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేస్తుంది. కానీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆ పథకం ఉందన్న సంగతి కూడా తెలియదంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది.

నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉప్పునుంతల మండల కేంద్రంలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 2023 నవంబర్‌లో ప్రారంభించారు. ఆసుపత్రి పరిధిలో 27 పంచాయతీలు ఉండడంతో, ప్రతి రోజు 200 పైగా ఓపీతోపాటు, 50 మందికిపైగా రోగులు ఆసుపత్రిలలో చేరుతున్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. కాగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు మూడు పూటల భోజనం అందించాల్సిన ఏజెన్సీ కాంట్రాక్టర్ ఆసుపత్రి ప్రారంభించినప్పటి నుంచి ఒక్క సారి కూడా భోజనం కాదుకదా తాగునీరు సరఫరా చేసిన దాఖలాలు లేవని రోగులు వాపోతున్నారు. ప్రతి రోజు 50 మంది చొప్పున రోగుల పేరుతో కాంట్రాక్టర్ బిల్లులు కాజేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలతో పాటు జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్తగా ఉన్న రామకృష్ణ ఆసుపత్రికి ఎప్పుడో ఒకసారి వచ్చి వెళ్తున్నారు. అంతేకాని సూపరింటెండెంట్ విధులతో పాటు జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షణ మరిచిపోయారని స్థానికులు విమ్మరిస్తున్నారు. అత్యవసర సేవలలో ఉండి కూడా రోగుల బాగోగులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వైద్య సేవలు, రోగుల భోజన వసతి గురించి వివరణ కోసం పలు మార్లు సూపరింటెండెంట్‌ను ఫోన్‌ను సంప్రదించినా ఆయన అందుబాటులోకి రాలేదు.

భోజనం ఎప్పుడూ పెట్టలే..



ఆసుపత్రి ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు రోగులకు భోజనం పెట్టింది చూడలేదు. మేము చాలా సార్లు ఆసుపత్రికి వస్తుంటాం. కనీసం టాబ్లెట్ వేసుకునేందుకు కూడా ఆసుపత్రిలో నీళ్ల లేవు. ఇక్కడ ఎవరూ పట్టించుకోరు.

- సుద్రేష్ట, ఉప్పునుంతల

తగిన మంచాలు లేవు



అనారోగ్యంతో ఆసుపత్రికి వస్తే మంచాలు లేక ఒకరి తర్వాత ఒకరికి వైద్యం చేస్తున్నారు. సరైన సిబ్బంది లేక ఇలా చేస్తున్నామని ఇక్కడున్నవారు చెబుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని అందరికి వైద్యం అందేలా చూడాలి.

- పద్మ, కంసానిపల్లి

భోజనం, తాగునీరు ఇస్తున్నాం

ఆసుపత్రి ప్రారంభం నుంచి జనవరి వరకు వంట ఏజెన్సీ బిల్లులు వచ్చాయి. ఫిబ్రవరి నుంచి మాకు బిల్లులు నిలిచి పోయాయి. ఆసుపత్రిలో రోగులకు మూడు పూటలు భోజనంతో పాటు తాగునీటి వసతి కల్పిస్తున్నాం.

- రామస్వామి, ఏజెన్సీ కాంట్రాక్టర్

గుర్రంగడ్డలో అధికారుల పర్యటన



ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో కాంతమ్మ

గద్వాల, సెప్టెంబరు 21: జోగుళాంబ గద్వాల జిల్లాలో దివి గ్రామం గుర్రంగడ్డను శనివారం అధికారుల బృందం పర్యటించింది. జడ్పీ సీఈవో కాంతమ్మ, డిప్యూటీ సీఈవో భాగ్యలక్ష్మి, విషరీష్ అధికారి షకీలాబాను, ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీవో చంద్రకళ గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. మొదట వారు జములమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాఠశాలను తనిఖీ చేశారు. గ్రామంలో ఉన్న విద్యార్థుల సంఖ్య పాఠశాలకు వచ్చే వారి సంఖ్యను తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయుల పేరు గుర్తుండిపోయే విధంగా వారితో కలిసిపోవాలని జడ్పీ సీఈవో సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.2లక్షల నిధులు ఇవ్వాలని ఉపాధ్యాయుడు జడ్పీ సీఈవోను కోరారు. ఆమె పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. దివి గ్రామమైన ప్రజలు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో గ్రామంలోనే నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయగా జడ్పీ సీఈవో పరిశీలించారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటికీ రూ.5లక్షల బిల్లులు రాలేదని మాజీ సర్పంచ్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. తప్పక బిల్లులు అందేవిధంగా చూస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో హెల్త్ సబ్‌సెంటర్ ఏర్పాటు చేస్తే జ్వరాలు వస్తే ఏఎన్ఎంల ద్వారా బాగుచేసుకుంటామని మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆమె హామీ ఇచ్చారు. వీరి వెంట పంచాయతీ కార్యదర్శి పాండు, జడ్పీ సిబ్బంది ఉన్నారు.

అటవీ న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



శిక్షణ తరగతుల ముగింపులో అటవీ శాఖ అధికారులు

మన్ననూర్, సెప్టెంబరు 21 : అటవీ న్యాయ చట్టాలపై ప్రతి ఉద్యోగి అవగాహన కలిగి ఉండాలని సెంటర్ ఫర్ వైల్డ్ లైఫ్ స్టడీస్ న్యాయవాది తిరుపతి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ డివిజన్‌లోని మన్ననూరు, మద్దిమడుగు, అమ్రాబాద్, దోమలపెంట రేంజ్‌ల పరిధి లోని అటవీ రేంజ్, డిప్యూటీ రేంజ్, సెక్షన్, రేంజ్ అధికారులకు భారతీయ నాగరిక సురక్ష సంహిత, అటవీ శాఖ నేరాల్లో కేసులు నమోదు చేసే విషయమై మన్ననూరులోని పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో శనివారం ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. వైల్డ్‌లైఫ్ ఆఫ్ అమైన్‌మెంట్-2023 ప్రకారం అటవీ వన్య ప్రాణుల చట్టాల్లో వచ్చిన మార్పులను అధికారులకు వివరించారు. అడవిలో ఏదేని నేరం జరిగిన సందర్భంలో కేసులు నమోదు చేసే క్రమంలో డాక్యుమెంట్లను పకడ్బం దీగా జతచేయాలని సూచించారు. నేరాలకు పాల్పడకుండా అటవీ శాఖలో అమలయ్యే కఠినమైన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అమ్రాబాద్ ఫీల్డ్ కోఆర్డినేటర్ బాపురెడ్డి, అమ్రాబాద్, దోమలపెంట, మద్దిమడుగు, మన్ననూరు రేంజ్ అధికారులు గురుప్రసాద్, మహేందర్, దేవుజ పాల్గొన్నారు.

వైద్య విద్య విజ్ఞాన ప్రదర్శనకు స్పందన



ప్రదర్శన తిలకిస్తున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్

మహబూబ్‌నగర్ వైద్యవిభాగం, సెప్టెంబరు 21: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్ వైద్య కళాశాలలో మూడు రోజుల పాటు వైద్యవిద్య విజ్ఞాన ప్రదర్శన నిర్వహిస్తున్నారు. రెండో రోజు శనివారం పెద్దఎత్తున విద్యార్థులు తిలకించారు. 25 శాఖలు, 1,200 స్టాళ్లను ఏర్పాటు చేయగా, ప్రదర్శనలను తిలకించేందుకు 2,600 మంది హాజరయ్యారు. అదేవిధంగా మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రదర్శనను తిలకించారు. విద్యార్థులకు ఈ ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మానవ అవయవాలు, వాటి పనితీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మెడిసిన్ చదవాలనుకునే విద్యార్థులకు ఈ విజ్ఞాన ప్రదర్శన స్ఫూర్తివంతంగా ఉందని తెలిపారు.

ఏటీఎంలో రూ.17.97లక్షల నగదు చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ రాందాస్ తేజావత్

పెబ్బేరు రూరల్, సెప్టెంబరు 21 : వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ కేంద్రంలోని బస్టాండ్ పరిసర ప్రాంతంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.17,97,500 లక్షలు చోరీ జరిగినట్లు ఏఎస్పీ రాందాస్ తేజావత్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఏటీఎంలో డబ్బులు చోరీ కాగా శనివారం పోలీసులు, క్లూస్ టీం పరిశీలించారు. ఏఎస్పీ మాట్లాడుతూ గురువారం ఏటీఎంలో రూ.14 లక్షలు జమ చేయగా, అంతకు ముందే రూ.9,19,700 బ్యాలెన్స్ డబ్బులు నిల్వ ఉన్నట్లు తెలిపారు. మొత్తం 23,19,700 ఉండగా, రూ.5,27,200 ఖాతాదారులు నగదును విత్ డ్రా చేసినట్లు పేర్కొన్నారు. మిగతా రూ.19,92,500 ఏటీఎంలో నిల్వ ఉండగా శుక్రవారం రాత్రి గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లినట్లు వివరించారు. చోరీ ఘటనపై ఏటీఎం నిర్వాహకుడు నరసింహగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.

డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

- జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

- ఏపీ,తెలంగాణ సరిహద్దులో పోలీసుల మోహరింపు

- 200 మంది సిబ్బందితో వాహనాల తనిఖీ



డ్రైవర్లకు రోడ్డు నిబంధనలు వివరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అలంపూర్ చౌరస్తా, సెప్టెంబరు 21 : ప్రయాణికులను తరలించే డ్రైవర్లు, వాహన యాజమానులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. శనివారం ఏపీ-తెలంగాణ సరిహద్దు, కర్ణాటక ప్రారంభ సరిహద్దు ప్రాంతమైన 44వ జాతీయ రహదారిపై పుల్లూరు టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. డీఎస్పీ సత్యనారాయణ, ముగ్గురు సీఐలు, 18 మంది ఎస్ఐలు, 140మందికి పైగా పోలీసు సిబ్బంది, ఆర్‌టీఏ అధికారులు పాల్గొన్నారు. సాయంత్రం మూడు గంటలపాటు సరిహద్దు గుండా అటు, ఇటు వచ్చి వెళ్లే 76 బస్సులు, 171 కార్లు, ఆటోలు, 101 బైక్‌లు పలు గూడ్సు వాహనాలు తనిఖీలు చేశారు. ఇందులో సరైన పత్రాలు లేని వాటిని సీజ్ చేశారు. ఎస్పీ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఇంటర్ స్టేట్ బార్డర్ కావడం చేత ఇక్కడ మెగా వెహికల్ చెకింగ్ పెట్టామని, దీని వల్ల రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అవగాహన కలుగుతుందన్నారు. డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు అన్ని పత్రాలు కలిగి ఉండాలని, కొంత లాభం కోసం పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే వారి కుటుంబాల్లో తీవ్ర నష్టాన్ని మిగుల్చుతాయని అన్నారు. అందరూ నిబంధనలు పాటిస్తే సామాజిక బాధ్యత కలిగి ఉండటమేనన్నారు. అనంతరం మీడియాతో మాట్లడుతూ.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వాహనాల తనిఖీలు చేశామని, ప్రయాణికులకు, డ్రైవర్లకు అవగాహన కల్పించడమే దీని ఉద్దేశ్యమని తెలిపారు. ఇలాంటి తనిఖీల వల్ల అసాంఘిక కార్యకలాపాలు చేసే వారికి హెచ్చరిక వంటిదని, వాహనాలపై పోలీసుల నిఘా ఉందనే భావన ప్రయాణికుల్లో, డ్రైవర్లలో ఉంటుందన్నారు. పట్టుబడ్డ వాహనాల పత్రాలను పరిశీలించాక సరైన ఆధారాలు లేని వాటికి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ తనిఖీల్లో బ్రీత్ అనలైజర్, ఫింగర్ ప్రింట్ పరికరాలు, ఫేస్ డిటెక్టివ్స్, స్పీడ్ గన్స్, బాంబ్‌స్క్వాడ్, మిర్రర్స్ తదితర పరికరాలను ఉపయోగించారు. ఎలాంటి పత్రాలు లేని ఐదు బొలెరో వాహనాలు, 124 ఆటోలు, 102 బైక్‌లు, 16 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, 35 ఓవర్ స్పీడ్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు ఒలింపిక్ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 21: రాష్ట్ర ఒలింపిక్ క్రీడా సంఘం ఆదేశానుసారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో ఆదివారం సర్వసభ్య సమావేశం, ఉమ్మడి జిల్లా కమిటీని ఎన్నుకోవడానికి అడ్‌హక్ కమిటీ నిర్ణయించినట్లు కన్వీనర్ ఈ. కురుమూర్తిగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఒలింపిక్ కమిటీ ఎన్నిక ఉంటుందని, ఉమ్మడి జిల్లాలోని రిజిస్టర్ అయిన క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సర్వసభ్య సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు. అడ్‌హక్ కమిటీ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వ క్రీడా శాఖ వ్యవహారాల సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి ఉన్నట్లు పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 21: వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని మానాజీపేటకు చెందిన పాలకొండ సూర్యమ్మ కూతురు జ్యోతి ఈనెల 17వ తేదీన ఇంట్లో చెప్పకుండా వెళ్లింది. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. తల్లి సూర్యమ్మ తెలిపిన వివరాల ప్రకారం జ్యోతిని 8ఏళ్ల క్రితం నాగర్‌కర్నూల్ చెందిన కోట్ర మల్లికార్జున్‌కు ఇచ్చి వివాహం చేసినట్లు తెలిపారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో ఆరు నెలలుగా జ్యోతి తన ఇంటి వద్దే ఉండేదని తెలిపారు. వారికి కూతురిని తండ్రి వద్ద ఉంచుకుని భార్య జ్యోతిని కాపురానికి తీసుకువెళ్లకుండా విడాకుల కోసం కోర్టులో కేసు వేసినట్లు తెలిపారు. దీంతో తన కూతురు ఇల్లు వదిలి వెళ్లిపోయిందని అన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

చిరుతదాడిలో లేగ దూడ మృతి

కోయిలకొండ, సెప్టెంబరు 21: మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండల కేంద్రంలోని శ్రీరామకొండలో శనివారం మేత కోసం వెళ్లిన ఆవు దూడలపై చిరుత దాడి చేసి ఓ ఆవుదూడను ఎత్తుకెళ్లింది. రైతు రాజుగౌడ్ వెతకగా కొంత దూరంలో మృతి చెందిన ఆవుదూడ కనిపించింది. కొన్ని రోజుల నుంచి శ్రీరామకొండలో చిరుత సంచారం చేస్తుందని ఆ ప్రాంత రైతులు వాపోతున్నారు. చిరుతదాడిలో మృతి చెందిన ఆవు దూడకు అటవీశాఖ అధికారులు నష్ట పరిహారం అందించాలని గ్రామస్తులు కోరారు.

పిడుగు పాటుకు పాడి ఆవు మృతి

చారకొండ, సెప్టెంబరు 21 : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని జేపల్లి పంచాయతీ పరిధిలోని దొడ్లపల్లికి చెందిన రైతు మాధవరెడ్డి పాడి ఆవు పొలంలో మేత మేస్తుండగా శనివారం పిడుగు పాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ. 90 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

కారు బోల్తా పడి ముగ్గురికి గాయాలు

కొత్తకోట, సెప్టెంబరు 21 : వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ సమీపంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పట్టణ సమీపంలోని మదర్ థెరిస్సా జంక్షన్ వద్ద శనివారం బీహార్ చెందిన ఆజాద్, సబురేస్, ఆస్లాం సొంత కారులో బెంగుళూరుకు వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు కిందకు వెళ్లి బోల్తా పడింది. కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయలు కావడంతో 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తీసుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

ఆటో, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

వంగూరు, సెప్టెంబరు 21: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని తిప్పారెడ్డిపల్లిలో శనివారం సాయంత్రం ఆటో బైక్ ఢీకొని ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజర గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వంగ విష్ణుగౌడ్ తన ఆటోను తీసుకొని డిండికి వెళ్తున్నాడు. తిప్పారెడ్డిపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్.. ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ విష్ణుగౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమ్మితం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

సూపర్ మార్కెట్‌లో చోరీ

నారాయణపేట, సెప్టెంబరు 21: జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ సమీపంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర సూపర్ మార్కెట్‌లో శుక్రవారం రాత్రి రేకును తొలగించి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన శనివారం వెలుగు చూసింది. సీసీ కెమెరాల డీవీసీ పరికరాన్ని, కౌంటర్‌లో ఉన్న రూ.4వేల నగదును ఎత్తుకెళ్లారు. దుకాణంలో సామగ్రి చిందర వందర చేసి పరారయ్యారు. పట్టణంలో వరుసగా రెండు సూపర్ మార్కెట్‌లలో చోరీ జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

'కురుమూర్తి' ఆలయంలో వేలం పూర్తి

చిన్నచింతకుంట, సెప్టెంబరు 21: మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు విక్రయించేందుకు లడ్డూ, పులిహోరా ఏడాది పాటు అమ్మకాలకు శనివారం వేలం నిర్వహించారు. లడ్డూ, పులిహోరా విక్రయించేందుకు రూ.45.11లక్షలు పలికింది. తలనీలాల సేకరణకు రూ.25.15లక్షలు పలికింది.

కార్యక్రమంలో అమ్మాపూర్ సంస్థానాధీశులు రాజా రాంభూపాల్, ఇన్‌చార్జి ఏసీ మదనేశ్వర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం 'పోషణ్ అభియాన్'

-ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 21: పేదలకు వరం పోషణ్ అభియాన్ అని, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలలో బలమైన పౌష్టికాహారం అందిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. పోషణ్ అభియాన్ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా సంక్షేమ అధికారి రాజేశ్వరి, ఆర్డీవో మాధవితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గర్భిణుల కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందజేస్తుందన్నారు.

ఎసీడీసీవో కమల, పోషణ బియాన్ డీసీ విజ్ఞాన్, ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మాపూర్‌లో..

వంగూరు: మండలంలోని ఉమ్మాపూర్‌లో శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పద్మ, ఎన్ఎం లక్ష్మీదేవమ్మ, అంగన్‌వాడీ టీచర్ ఈశ్వరమ్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.


పోషణ్ అభియాన్ మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజేష్ బాబు

కొల్లాపూర్, సెప్టెంబరు 21: జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజేష్ బాబుపిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని సింగోటం గ్రామంలోని రైతు వేదికలో నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. చిన్న చిన్న తగాదాలను పరిష్కరించడానికి రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఇరు వర్గాలకు సమ న్యాయం అందుతుందని తెలిపారు. రాజీమార్గం రాజమార్గమని, ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సబిత కార్యదర్శి కం సీనియర్ సివిల్ న్యాయాధికారి, నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఆర్‌వీఎస్ఎస్ మిథున్ తేజ, చైర్మన్ కం ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయ సేవాధికార సంఘం, కొల్లాపూర్ 1వ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి జ్యోత్స్న గుంటి హాజరై లోక్ అదాలత్‌ను దిగ్విజయం చేయాలని కోరారు. అనంతరం కొల్లాపూర్‌లో కోర్టు హాల్‌లో న్యాయవాదులు, పోలీసు అధికారులతో లోక్ అదాలత్ గురించి జిల్లా ప్రధాన న్యాయాధికారి రమేష్ బాబు సన్నాహక సమావేశం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తులు, పోలీస్ సిబ్బంది న్యాయస్థానాల సిబ్బంది అందరూ కలిసి కోర్టు ప్రాంగణంలో చెత్తను శుభ్రపరిచి స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. డీఎస్పీ శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కర్నె హరి, న్యాయవాదులు శ్రీనివాసరావు, వసంత రెడ్డి, భాస్కర్ రెడ్డి, మోహన్ లాల్, బాలస్వామి, నిరంజన్, కురుమూర్తి, మధుసూదన్ రావు, నాగరాజు, రాఘవేంద్ర, గోవింద్, కురుమయ్య, రాజేష్, మహిళా న్యాయవాదులు రామ లక్ష్మమ్మ, నళిని, రేణుక హాజరయ్యారు. స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేష్, హృషికేష్, పోలీస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శి , గ్రామ ప్రజలు హాజరయ్యారు.


సింగోటం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజేష్ బాబు

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిద్దాం


కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

కల్వకుర్తి, సెప్టెంబరు 21: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిద్దామని కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ ముఖ్య సలహాదారు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లు అన్నారు. కల్వకుర్తి పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం ముందు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చైర్మన్ ఎడ్మ సత్యం, బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ ముఖ్య సలహాదారు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ తొలి, మలి ఉద్యమంలో తనదైన ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగుదామని అన్నారు. కౌన్సిలర్ సైదులుగౌడ్, గంగాధర్‌చారి, శ్రీనివాస్, బాలరాజు, రమేష్‌బాబు, కృష్ణగౌడ్, రాంభూపాల్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, ప్రమోద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఊర్కొండ: స్వాతంత్ర్య సమరయోధుడు, స్వరాష్ట్రం కోసం పరితపించిన తెలంగాణ వాది కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని నవభారతి అసోసియేషన్ చైర్మన్ మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. నాయకులు ఎండీ అక్బర్, దార గోపాల్, ఖాదర్, నసీర్, ఆంజనేయులు, మహబూబ్ జహంగిర్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు నమోదు చేపట్టాలి

బిజినేపల్లి, సెప్టెంబరు 21 : ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా చేపట్టాలని బీఎల్‌వోలను నాగర్‌కర్నూల్ ఆర్డీవో ఎ.సురేష్ ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, కార్యాలయ సిబ్బంది పనితీరును, రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఓటరు నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్న బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 2025, జనవరి 1లోపు 18 సంవత్సరాలు నిండే ప్రతీ ఒక్కరిని ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో ఒక వార్డు నుంచి మరో వార్డుకు బదిలీ, ఓటరు నమోదులోని తప్పుల సవరణ, తొలగింపు వంటి వాటిని ఓటరు నుంచి సంబంధిత ఫారాల్లో వివరాలు నమోదు చేయించుకొని నమోదు చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా రూపొందించేందుకు తక్కువ సమయం ఉన్నందున వేగవంతంగా పకడ్బందీగా ఓటరు నమోదు చేపట్టాలని, విధుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దారు జనంపల్లి శ్రీరాములు, ఆర్ఐ బాలరాజు, సీనియర్ అసిస్టెంట్ భారతి, రికార్డు అసిస్టెంట్ భగవంతు, పంచాయతీ కార్యదర్శి మహేష్ నాయక్, బీఎల్‌వోలు మంగ, మల్లీశ్వరి, నిర్మల, తిరుపతమ్మ, నాగమణి, సిబ్బంది శ్రీశైలం, యశ్వంత్ కుమార్, సామ రవి తదితరులు ఉన్నారు.

● తిమ్మాజిపేట: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు నమోదు సర్వేను సకాలంలో పూర్తి చేయాలని నాగర్‌కర్నూల్ ఆర్డీవో సురేష్ మండల అధికారులను ఆదేశించారు. శనివారం తిమ్మాజిపేట మండలంలోని గుమ్మకొండ, అప్పాజిపల్లి, తిమ్మాజిపేట పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో నరేష్ సందర్శించి పరిశీలించారు. తహసీల్దార్ రామకృష్ణయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.


బిజినేపల్లిలో బీఎల్‌వోలతో మాట్లాడుతున్న ఆర్డీవో సురేష్

డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

కల్వకుర్తి, సెప్టెంబరు 21 : కల్వకుర్తి పట్టణంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లను దసరా వరకు అప్పజెప్పాలని కోరుతూ శనివారం లబ్ధిదారులు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇంటి అద్దెలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉన్న పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయించి అప్పగించాలని ఈ సందర్భంగా లబ్ధిదారుల పోరాట సంఘం కమిటీ సభ్యులు కోరారు. సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి కృష్ణవేణి, ఉపాధ్యక్షుడు నర్సింహ, కోశాధికారి శ్రీనివాసులు, బాలకృష్ణ, సభ్యులు మంజుల, బాగ్యమ్మ, అరుణ్, సఫియా, కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి


మాట్లాడుతున్న పిడమర్తి రవి

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 21 : రాష్ట్రంలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ మాదిగల మేలుకొలుపు యాత్ర చేపట్టినట్లు మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి తెలిపారు. ఈ నెల 19న హైదరాబాదు నుంచి చేపట్టిన యాత్ర శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చేరింది. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ జాతి హక్కుల కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతున్నా రెండుగా విడిపోయాక తెలంగాణ రాష్ట్రంలో మాదిగల కొట్లాట అలాగే కొనసాగుతుందన్నారు. గత ప్రభుత్వం 2011లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ అంశంపై చర్చ లేకపోవడంతో మాదిగల జనాభా సరైన లెక్క తేలలేదని విమర్శించారు. మాదిగ ప్రజా సంఘాలు, ఉద్యోగులు, మేధావులు, విద్యార్థులను మేల్కొలిపేందుకు యాత్ర ఈ నెల 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సురేష్, రామకృష్ణ, సాయిబాబు, అభి, వినోద్, పరశురాములు, బాలరాజు, మొగులయ్య, ఎత్తపు చంద్రస్వామి, శివ, రవి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం


కొల్లాపూర్ పట్టణంలో మిషన్ భగీరథ అధికారులతో కలిసి సమస్యలు తెలుసుకుంటున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య

కొల్లాపూర్, సెప్టెంబరు 21: కొల్లాపూర్ మునిసిపల్ పరిధిలో ఉన్న అన్ని వార్డుల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నివారణ చర్యలు చేపట్టినట్లు మునిసిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య వెల్లడించారు. శనివారం కొల్లాపూర్ పట్టణంలో ఉన్న మిషన్ భగీరథ పథకం నీటి ట్యాంకులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. గత నాలుగు సంవత్సరాలుగా మిషన్ భగీరథ పనులను నిర్లక్ష్యం చేసి ప్రజలకు అవస్థలు కల్పించారని, పనుల శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులు బండయ్య గుట్ట, ఖాదర్ బాషా దర్గా, శ్రీకృష్ణ దేవస్థానం దగ్గర గల ట్యాంక్‌ల ద్వారా పంపిణీ అవుతున్న నీటి సరఫరాను మిషన్ భగీరథ అధికారులతో కలిసి మునిసిపల్ ప్రజాప్రతినిధులు పరిశీలించారు. అక్కడ పలు సమస్యలను గుర్తించి మిషన్ భగీరథ కాంట్రాక్టర్లకు సూచనలు చేశారు. వారం రోజులలో ప్రతీ ఇంటికి సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలని అన్నారు. జోనల్ వైజ్‌గా ఉన్న ట్యాంకుల కింద ఎన్ని వాటర్ కనెక్షన్‌లు ఉన్నాయో సర్వే చేసి నివేదికలు ఇవ్వాలని కోరారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం చేస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు ఉంటాయని ఆమె అన్నారు. మిషన్ భగీరథ ఈఈ విజయ్ భాస్కర్, డీఈ శ్రీనివాస్ రావుతో పాటు మునిసిపల్ కౌన్సిలర్లు షేక్ రహీం పాషా, అబ్దుల్ నయిమ్, బరిగెల రాముడు, నాయకులు మేకల నాగరాజు రెడ్డి, సత్యం, బరిగెల వేణు గోపాల్, కర్నె వాసు, కర్నె శివ, బోరెల్లి మహేష్, ఎల్లగౌడ్, జేఈ షబ్బీర్, మునిసిపల్ ఏఈ హేమలత, మునిసిపాలిటీ వాటర్ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ బధితురాలికి ప్లేట్‌లెట్స్ అందజేత


డెంగీ రోగికి చికిత్స అందించేందుకు ప్లేట్‌లెట్స్‌ను అందజేస్తున్న ఆంజనేయులు

కందనూలు, సెప్టెంబరు 21: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డెంగీ వ్యాధితో చికిత్స పొందుతున్న బాధితురాలికి దేశిటిక్యాల గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే యువకుడు తన రక్తం ప్లేట్‌లెట్స్‌ను అందజేశారు. జిల్లా జనరల్ ఆసుపత్రిలో కొల్లాపూర్ పట్టణానికి చెందిన రాధకు అత్యవసరంగా ఎ-పాజిటివ్ ప్లేట్‌లెట్స్ అవసరంగా కావడంతో రెడ్‌క్రాస్‌ను సంప్రదించారు. దీంతో శనివారం రెడ్‌క్రాస్ పిలుపు మేరకు ఆంజనేయులు జిల్లా జనరల్ ఆసుపత్రికి చేరుకుని తన ప్లేట్‌లెట్స్‌ను దానం చేసి మానవత్వం చాటుకున్నాడు. రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, జిల్లా యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ కుమార్, కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు కృష్ణారావు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి


ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించి ఎస్‌జీఎఫ్ కీడ్రా పోటీల్లో పాల్గొని కీడ్రాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో

కల్వకుర్తిటౌన్, సెప్టెంబరు 21: క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని డీఈవో గోవిందరాజులు అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచే ప్రతీ ఒక్కరు మంచి నడవడికను అలవర్చుకోవాలని, ఉపాధ్యాయులు, వివిధ సంక్షేమ సంఘాల నాయకులు చెప్పిన మంచి నడవడికను అలవర్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడలకు అండర్ - 14, అండర్-17 విభాగాల్లో విద్యార్థిని, విద్యార్థులను క్రీడా పోటీలను నిర్వహించి ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ అధ్యక్షుడు యాదయ్యగౌడు, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, కోశాధికారి పురమ్‌చంద్, పీడీలు మోహన్, జగన్, అంజి, రమేష్, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

● చారకొండ: విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఏజెన్సీ వారికి డీఈవో గోవిందరాజులు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఉన్నతి కార్యక్రమం పనితీరు, పారిమేటివ్ పరీక్షల నిర్వహణ, 10వ తరగతి ప్రత్యేక తరగతులపై జీహెచ్‌ఎం భగవాన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహించాలి

వంగూరు, సెప్టెంబరు 21: రక్తపోటు, మధుమేహం ఉన్న వారికి సక్రమంగా వైద్య పరీక్షలు నిర్వహించి వారికి సకాలంలో ముందులు అందజేయాలని నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృష్ణమోహన్ వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం వంగూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సిబ్బందికి సమావేశం నిర్వహించారు. వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. కల్వకుర్తి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ భీమానాయక్, స్థానిక వైద్యాధికారి శ్రుతి, సీహెచ్‌వో సుధాకర్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య

కల్వకుర్తిటౌన్, సెప్టెంబరు 21 : ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య అందుతున్నదని డీఐఈవో వెంకటరమణ అన్నారు. శనివారం ఆయన కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల వాతావరణం విద్యార్థులకు అనుకూలంగా ఉందని, ఉత్తమమైన అధ్యాపక బృందం ఉండటంతో పేదింటి విద్యార్థులు, అన్నివర్గాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాగే భవిష్యత్తులో చదువుల్లో, క్రీడల్లో, కళాశాలకు మంచిపేరును సాధించాలని ఆకాంక్షించారు. మునిసిపల్ కమిషనర్ అహ్మద్‌షేక్, గర్ల్స్‌హైస్కూల్ హెచ్‌ఎం నిర్మల, కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ వేణయ్య, అధ్యాపకులు రమాకాంత్, సదానందంగౌడు, శ్రీనివాస్, భీమేష్, రాజేష్, బాలరాజ్, మల్లికార్జున్, లక్ష్మీకాంత్‌సాగర్, లక్ష్మయ్య, నర్సింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీర తెలంగాణ నాటక ప్రదర్శన


కళాకారుల నాటక ప్రదర్శన

వంగూరు, సెప్టెంబరు 21: మండలంలోని డిండిచింతపల్లిలో శనివారం ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కళాకారులు కళారూపాల ద్వారా ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ పోరాట వారోత్సవాల సందర్భంగా కళాకారులు వెట్టిచాకిరి, దోపిడీ, విసునూరి రాంచంద్రారెడ్డి దౌర్జన్యం ఆగడాలు ఎనుకటి కాలంలో ఎలా ఉన్నాయో తమ కళారూపాల ద్వారా కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కట్ట నర్సింహ, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌ఓ7, మండల నాయులు బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 21: జిల్లాలోని కేజీబీవీల్లో వివిధ సబ్జెక్టుల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బందిని నియమించేందుకు స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయ్యింది. శనివారం కలెక్టరేట్ సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోని విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారిలో మెరిట్ ఆధారంగా ఒక్కో పోస్టుకు ముగ్గురి చొప్పున అభ్యర్థులను పిలిచి వారి విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా బాలిక విద్యా పర్యవేక్షణ అధికారి శోభారాణి మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బందిలో ఏడు పోస్టుల రిజర్వేషన్లకు సంబంధించిన అభ్యర్థులు అందుబాటులో లేకపోవడంతో వాటిని క్యారీ పార్వర్డ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీంతో సబ్జెక్టుల వారిగా మిగిలిన 34 పోస్టులకు సంబంధించి 1:3 ప్రకారం 92 మంది అభ్యర్థులను ధ్రువత్రాలను పరిశీలనకు పిలిచామని ఆమె తెలిపారు. జిల్లా సమగ్ర శిక్ష గణాంక అధికారి మధుసూదన్‌రెడ్డి, నోడల్ అధికారి కురుమయ్య, సెక్టోరియల్ అధికారులు షర్ఫుద్దీన్, నూరుద్దీన్, మురళీధర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పాండు, సెక్షన్ సిబ్బంది వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

- సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి

కల్వకుర్తిటౌన్, సెప్టెంబరు 21 : విద్యార్థులు చట్టాలపై అవగహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి అన్నారు. శనివారం ఆమె పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు విద్యాహక్కు చట్టం, బాలల హక్కు చట్టం, ర్యాగింగ్ వంటి చట్టాలపై పెంచుకోవాలని, సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశానుసరం విద్యాసంస్థలలో తరచుగా న్యాయ విజ్ఞానసదస్సులు నిర్వహించాలని పేర్కొన్నారు. నేర ప్రవృత్తి గతంలో కంటే ప్రస్తుత సమాజంలో ఎక్కువైందన్నాని, ప్రతీ విద్యార్థి జాగ్రత్త వహించాలని వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీళ్లుపోశారు. కల్వకుర్తి బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ వెంకటరమణ, న్యాయవాదులు రాంగోపాల్, నాగరాజు, మల్లేష్, శ్రీను, జంగయ్య, కోర్టు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలి

చారకొండ, సెప్టెంబరు 21: తల్లిదండ్రులు తమ బాధ్యతలు గుర్తెరిగి విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని జీహెచ్‌ఎం భగవాన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తమ పిల్లలు ఇంటి వద్ద టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచి చదువుపై శ్రద్ధ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీసీ చైర్మన్ సత్యమ్మ, ఉపాధ్యాయులు యాదగిరి, కమలాకర్, అంజయ్య, రాజేందర్ రెడ్డి, మల్లిఖార్జున్, జైపాల్, గీత, రామబిక్షమయ్య, రామకృష్ణ, బాలోజి, జంగయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు సన్మానం


మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌ను సన్మానించిన కాంగ్రెస్ ఐఎన్‌టీయూసీ నాయకులు

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 21: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నూతనంగా ఎన్నికైన అంతటి రజితను శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ నాయకుడు మహబూబ్ అలీ, నాయకులతో కలిసి శాలువాతో సన్మానించారు. రైతుల సమస్యల పరిష్కారంకోసం కృషి చేయాలని సూచించారు. నాయకులు మేకల రామచంద్రయ్య, చందు నాయక్, గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను సన్మానించిన నాయకులు

చారకొండ, సెప్టెంబరు 21: మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సునితను శనివారం బీఆర్ఎస్ నాయకులు కలిసి శాలువాతో సన్మానించారు. మండలంలో భూసమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ సునితను కోరారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ గజ్జె యాదయ్యగౌడ్, బీఆర్ఎస్ పార్టీ యూత్ ప్రసిడెంట్ చండీశ్వర్‌గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ రమేష్, నాయకులు సవారి జంగయ్యగౌడ్, జానపండు, కమలాకర్‌రావు, మల్లేష్ ఉన్నారు.

తిరుపతి లడ్డూలను కల్తీ చేయడం హేయమైన చర్య

మన్ననూర్, సెప్టెంబరు 21: తిరుపతి లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేయడం హేయమైన చర్య అని రాష్ట్ర ధర్మ రక్షక మండలి సభ్యులు సంభు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణ, బిల్లకంటి రమేష్ అన్నారు. వారు శనివారం మన్ననూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లడ్డూల కల్తీలో పాత్రులైన వారిని కఠినంగా శిక్షించేలా, చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చారకొండ, సెప్టెంబరు 21: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భాగంగా శనివారం మండలంలోని సిర్సనగండ్లలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ తెలిపారు. సిర్సనగండ్ల గ్రామపంచాయతీని ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ సందర్శించి పంచాయతీ, అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల, నర్సరీ, వార్డుల వారిగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలని సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని అన్నారు. గ్రామపంచాయతీల టార్గెట్ ప్రకారం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు జంగునాయక్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సముచిత న్యాయం

మన్ననూర్, సెప్టెంబరు 21: కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సముచిత న్యాయం లభిస్తుందని అచ్చంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటయ్య అన్నారు. అమ్రాబాద్ మండికి చెందిన కొత్తగా ఎన్నికైన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటయ్య , డైరెక్టర్లు నంది హన్మంత్‌రెడ్డి, అంబనారాయణలను మన్ననూరులో కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో శనివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తుల్యా నాయక్, ఎంపీటీజీ మాజీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు సంభు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణ, రాజారాం, వెంకటేశ్వర్లు, శివాజి, వెంకటయ్య, గోపాల్‌రెడ్డి, గంగాజి, రాజేంద్రప్రసాద్, రేణయ్య, శ్రీను, భరత్ పాల్గొన్నారు.

దృఢ సంకల్పంతో ముందుకు సాగాలి

తెలకపల్లి, సెప్టెంబరు 21: ప్రతీ వ్యక్తి తన జీవితంలో దృఢ సంకల్పంతో పాజిటివ్ ఆలోచనలు చేస్తూ ముందుకు సాగాలని తెలకపల్లి ఎస్ఐ బి.నరేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సీఎల్ఆర్ విద్యా సంస్థలు డిగ్రీ, ఇంటర్ విద్యార్థులకు ఆత్మహత్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు స్థానిక ఎస్ఐ బి.నరేష్ హాజరై ప్రసంగించారు. సీఎల్ఆర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ బి.రాజు, మహేందర్‌రెడ్డి, డైరెక్టర్లు మురళీధర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రకాష్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన నీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ఊర్కొండ, సెప్టెంబరు 21: పరిశుభ్రమైన నీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. శనివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటి ట్యాంకులను స్వచ్ఛ హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలను సందర్శించి పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

రోబోటిక్‌పై విద్యార్థులకు అవగాహన

వెల్దండ, సెప్టెంబరు 21 : విద్యారంగంలో సృజనాత్మకత సాంకేతికతను ప్రోత్సహించేందుకు సోహం అకాడమీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్, ఎస్సీ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోబోటిక్స్ ప్రాథమిక సూత్రాలపై ఈ సందర్భంగా అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థులకు సర్టిఫికెట్లు, రోబోటిక్ కిట్స్ పంపిణీ చేశారు. జిల్లా విద్యాధికారి గోవిందరాజులు, జిల్లా విజ్ఞాన అధికారి రాజశేఖర్ సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రిన్సిపాల్ శ్రీధర్, స్వర్ణరత్నం, సోహం అకాడమీ ఫౌండర్ సహదేవ్ తదితరులు ఉన్నారు.

'సంక్షేమ భవన్ ముట్టడిని జయప్రదం చేయండి'

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 21: హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన హైదరాబాదు సంక్షేమ భవన్ ముట్టడిని జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న పిలుపునిచ్చారు. శనివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో చలో సంక్షేమ భవన్ ముట్టడి పోస్టర్‌ను విడుదల చేశారు. కేవీపీఎస్ నాయకులు సత్యనారాయణ, కృష్ణ, శివరాం, నరేందర్, రాములు, కృష్ణ, చంద్రయ్య పాల్గొన్నారు.

● కొల్లాపూర్: హైదరాబాద్‌లోని చలో సంక్షేమ భవన్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కేవీపీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం విడుదల చేశారు. బత్తిని రాజు మండల నాయకులు సాయి, రాంబాబు, పరమేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త్రలో హిందీ దివస్

వెల్దండ, సెప్టెంబరు 21 : మండల పరిధిలోని కొట్ర ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వెల్దండ, పోతేపల్లి, రాచూరు, బాలికల ఉన్నతపాఠశాల, మార్చాల పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రత్యేకంగా తయారు చేసిన ఆకృతులపై హిందీలో వివరించి ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రేమకుమారి, రవీందర్ ఉన్నారు.